పూర్తిగా అధ్వానంగా తయారైన కిడిమి రహదారి

విశాలాంధ్ర-జలుమూరు: మండల కేంద్రం సారవకోట నుండి కిడిమి వెళ్లే సుమారు ఐదు కిలోమీటర్ల పొడవు గల రహదారి సారవకోట నుండి చోడసముద్రం వరకు బాగానే ఉందని అక్కడి నుండి కిడిమి భద్రాచలం వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా అద్వానంగా తయారయింది. చిన్నపాటి వర్షం వస్తే చెరువులను తలపించే విధంగా కనిపిస్తున్నాయని ఇటువంటి ప్రధాన రహదారులను సంబంధిత అధికారులు కనీసం పరిశీలించండం లేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు పరిశీలించి కిడిమి గ్రామానికి పక్క రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు.

రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ : ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-పోలాకి : ఈ ఏడాది రైతులకు నాణ్యమైన వరి విత్తనాలు అందరికీ అందే విధంగా అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం పోలాకి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఒక్క రైతుకు నాణ్యమైన వరి విత్తనాలు ప్రభుత్వ రాయితీపై అధికారులు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ లక్ష్మీనారాయణ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు సూరపు నారాయణ దాస్ సర్పంచ్లు ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు మార్పుల కోసం ఫలసాయాన్నిచ్చే కొబ్బరి చెట్లు నరికివేత

విశాలాంధ్ర-జలుమూరు : ఒక మొక్క పెంచాలన్నా అనేక కష్టనష్టాలు పడి పెద్దది చేసి ఫలసాయాన్నిచ్చే సమయంలో అవసరాలకు నరికివేస్తే ఎంత బాధాకరమని పలువురు విమర్శిస్తున్నారు. బొంగడిపేట జంక్షన్ నుండి కిడిమి గ్రామానికి వెళ్లే రహదారి ప్రక్కన గత పది సంవత్సరాలుగా పెంచిన కొబ్బరి చెట్లు చిన్నచిన్న కాపుకు వస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు కోసం వాటిని నలికి వేశారు. దీంతో చూసిన ప్రతి ఒక్కరు విచార వ్యక్తిపరిచారు. అవసరాల కోసం వినియోగించకు తప్పదని అంటున్నా ఇటువంటి మంచి వృక్షాలను తెగ్గొట్టడం అనేక విమర్శలు వస్తున్నాయి.

క్యాన్సర్‌తో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి

విశాలాంధ్ర- సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం రుంకు హనుమంతుపురం గ్రామానికి చెందిన సైలాడ బాలరాజు (37) ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ క్యాన్సర్‌తో మృతిచెందారు. ఈమేరకు కుటుంబ సభ్యులు మంగళవారం స్వగ్రామమైన రుంకు హనుమంతుపురం గ్రామంలో అంత్యక్రియలు కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాదులో ఆర్ఎం రిజర్వ్ ఫోర్స్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా గత మూడు సంవత్సరాల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స పొందుతుండగా ఈనెల 2వ తేదీ రాత్రి మృతిచెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య ఒక కుమార్తె ఉన్నారు.

యోగాతో రుగ్మతలు దూరం

ప్రభుత్వ విప్ అశోక్

విశాలాంధ్ర-కవిటి: యోగాతోనే దీర్ఘకాలిక రుగ్మతులు దూరం చేయవచ్చునని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కవిటి మండలం కొత్తపాలెం బీచ్ లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాల్డతూ సమాజంలో అన్ని వర్గాలకు యోగాను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. 45 నిమిషాల సరళ యోగా... సర్వ రోగ నివారిణి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బెహరా. మురళీ మోహనరావు,ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు, ఏవో కే.శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ ధనుంజయ మజ్జి,అన్ని శాఖల అధికారులు, కూటమి నాయకులు,పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది, మహిళా సమైక్య సిబ్బంది,అంగన్వాడి కార్యకర్తలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి వార్షికోత్సవంలో అన్నప్రసాదం వితరణ

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం కుమ్మరి గుంట జంక్షన్‌లో శ్రీ ఆంజనేయ స్వామి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు యువకులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు అలంకరణ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక భజన కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

టీసీఎస్ క్యాంపస్ ఇంటర్వ్యూలలో 80మంది ఆదిత్య విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర- శ్రీకాకుళం టౌన్ : ఇటీవల కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో హైదరాబాద్ కు చెందిన ప్రముఖ బహుళ జాతి సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలలో తమ ఆదిత్య డిగ్రీ కళాశాల కో-ఎడ్ క్యాంపస్ విద్యార్థులు 60 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎన్.వి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ఒక్క టిసిఎస్‌లో వివిధ విభాగాలకు శ్రీకాకుళం డిగ్రీ కళాశాలల నుండి మొత్తం 150 మంది ఎంపికైనట్లు ఇది శ్రీకాకుళం డిగ్రీ కళాశాలల చరిత్రలోనే అత్యుత్తమ రికార్డు అని తెలిపారు. ఈసందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాల సెక్రటరీ సుగుణారెడ్డి ఆదిత్య డిగ్రీ కళాశాల క్యాంపస్ ఇంటర్వ్యూలకు మారుపేరుగా మారిందని, ఆదిత్య డిగ్రీ కళాశాలలలో ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 17,140 ఉద్యోగాలతో అత్యుత్తమ రికార్డు నెలకొల్పామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలలో అత్యధిక ఉద్యోగాలు సాధించిన సంస్థగా నిలిచిందని తెలిపారు. అనంతరం కళాశాల అకాడమిక్ డైరెక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు మాట్లాడుతూ టిసిఎస్ సాఫ్ట్‌వేర్ లాంటి ప్రముఖ కంపెనీలకు 60 మంది విద్యార్థులు ఒక బ్యాచ్ నుండే ఎంపిక అవడం హర్షనీయమని తెలిపారు. తమ శ్రీకాకుళం ఆదిత్య డిగ్రీ విద్యార్థులు ఇప్పటివరకు 767 ఉద్యోగాలు సాధించి ముందంజలో నిలిచారని తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్ డా.యన్.శేషారెడ్డి, డైరెక్టర్ బి.యస్.చక్రవర్తి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ఫోటో: టీసీఎస్ క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికయిన విద్యార్థులు: 03ఎస్‌కెఎల్ఎం02

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు ఏజెంట్లుగా పనిచేయుటకు దరఖాస్తులను స్వీకరణ

శ్రీకాకుళం పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : తపాలా శాఖ, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్లో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు నందు డైరెక్ట్ ఏజెంట్లుగా పనిచేయుటకు 10 వ తరగతి పాస్ అయిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించటం జరుగుతున్నదని శ్రీకాకుళం పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు తెలిపారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకై దగ్గరలోని పోస్టాఫీసును సంప్రదించాకన్నారు. జూన్ 10 తేది నాటికి దరఖాస్తులు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, శ్రీకాకుళం డివిజన్ -532 001 వారి చిరునామాపై రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కానీ స్పీడ్ పోస్ట్ ద్వారా కానీ పంపవలెనన్నారు. సదరు దరఖాస్తుతో ఆధార్ కార్డు మరియు పాన్ కార్డు జెరాక్స్ జత చేయాలన్నారు. ఏజెంట్ కేవలం చేసిన పాలసీలపై కమీషన్ ఆధారితం మాత్రమే, ఇది ఎటువంటి ఉద్యోగ ప్రకటన కాదని గమనించగలరని హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి కుటుంబానికి హోం కంపోస్ట్ తప్పనిసరి : ఏపీఎం కూర్మారావు

విశాలాంధ్ర-మందస : గ్రామీణ ప్రాంతంలో ప్రతీ కుటుంబానికి కూడా ఒక హెూం కంపోస్ట్ పిట్‌తోపాటు కిచెన్ గార్డెన్ తప్పని సరిగా ఉండాలని దీనిపై మహిళా సంఘ సభ్యులందరికీ పల్లె పల్లెలో అవగాహన కల్పించాలని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం, గ్రామీణ పారిశుధ్య నిర్వహణలో భాగంగా ఉపాధి హామీ పథకం నుంచి పశువులను పెంచుతున్న రైతులకు టైప్ వన్ కంపోస్ట్ పిట్ లను, మిగతా వారికి టైప్ టు కంపోస్ట్ పిట్ లను మంజూరు చేస్తున్నట్లు వివరించారు. మందస మండలంలో సుమారు 8 వేల కంపోస్ట్ పిట్ లను ఏర్పాటు చేసుకోవలసిన ఆవశ్యకతను సభ్యులందరికీ వివరించాలని తెలిపారు. ప్రతి మహిళ కూడా తన పెరటిలో ఎరువులు ,క్రిమిసంహారక మందులు వాడకుండా కనీసం తమ కుటుంబాలకు సరిపడిన ఆకుకూరలు, కాయగూరలు, మునగ, బొప్పాయి, తదితర మొక్కలను పెంచుకోవడం ఎంతో ప్రయోజనమని వివరించారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ కళ్యాణి, ఎఫ్.పి.ఓ. అకౌంటెంట్ కృష్ణకుమారి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు స్వామి నాయుడు, కిషోర్, ముఖలింగం, మీనాక్షి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఈగల్ ఉక్కుపాదం

విశాలాంధ్ర-కవిటి: యోగాంధ్రాలో భాగంగా ప్రభుత్వం మధక ద్రవ్యాల నివారణపై ఉక్కుపాదం మోపడానికి ఈగల్ని స్థాపించిందని, ఈగల్ డేగ కన్నుతో అనునిత్యం గంజాయ్ నివారణపై చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కొత్తంపాలెం బీచ్లో ఆయన మాట్లాడుతూ మాధక ద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయ్ వంటివి సేవించడం వలన కలిగే దుష్పలితాలు వివరించారు. ఈగల్ టీం సభ్యులు సంతోష్ మాట్లాడుతూ వాటిని ఎవరైన రావాణా చేసిన, అమ్మకాలు జరిపినట్లయితే టోల్ ఫ్రీ నెంబరు 1972కు సమాచారం అందించాలని తెలిపారు. దీనిపై ఎన్డీపీఎస్ చట్టాన్ని కూడా ప్రయోగిస్తుందని, ముఖ్యంగా స్కూల్, కాలేజీ పిల్లలను టార్గెటుగా చేసుకొని మత్తు పదార్థాలకు అలవాటు చేస్తున్నారు. మీ పిల్లలు ఎవరైన వాటికి బారిన పడితే ఈగల్ టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా ఈగల్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.మురళీ మోహనరావు, ఎంపీడీవో విశ్వేశ్వరరావు, ఎస్ఐ రవివర్మ,ఏవో శ్రీనివాస్ రెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

విశాలాంధ్ర-పలాస: పలాస మండలం సున్నాడ గ్రామానికి చెందిన కుమ్మరి ఉపేంద్ర (63) ఆర్టీసీ బస్సు డీ కొని మంగళవారం మృతి చెందారు. కాశీబుగ్గ పోలీసులు కథనం మేరకు పలాస మండలం సున్నాడ గ్రామానికి చెందిన కుమ్మరి ఉపేంద్ర సైకిల్ పై తమ ఇంటి విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు పలాస విద్యుత్ కార్యాలయానికి వచ్చాడు. బిల్లు చెల్లించి తిరిగి ఇంటికి వెళ్ళుతున్న సమయంలో ఆర్టీసీ బస్సు వెనుక భాగం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే క్షతగాత్రుడును పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడుకు కొడుకు, కుమార్తె ఉన్నారు. గత ఏడాది బార్య మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ తెలిపారు.

శిథిలావస్థకు చేరిన వంశధార వంతెనలు... పట్టించుకునేవారు లేరా?

విశాలాంధ్ర -జలుమూరు : మండలం 13 కిలోమీటర్ల పొడవులో ఉన్న వంశధార ప్రధాన ఎడమ కాలువపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒక్కొక్క వంతెన అనేక గ్రామాలకు ఉపయోగ పడుతుందని నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వంతెన కిందన ఆనాడేస్లాబ్ కోసం ఏర్పాటుచేసిన ఇనుము గజాలు పూర్తిగా బయటకు కనిపించబోతున్నాయి. ఏదో ఒకనాడు ఇవి నేలమట్టం అయ్యే అవకాశం ఉందని ఆ ప్రాంత ప్రజలు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు పాలకులు పరిశీలించి ఈ వంతెన స్థానంలో కొత్త వంతెనలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రేషన్ సరుకులు పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి కొనేదల పవన్ కళ్యాణ్, రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు మేరకు ప్రతి రేషన్ లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు చౌక ధరల దుకాణం దగ్గర ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి పేద వాడికి పంపిణి చేపట్టాలనే దృక్పధంతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణం ప్రారంభించడం జరిగింద శాసన సభ్యులుమామిడి గోవిందరావు, కూటమి నాయకులు మంగళవారం పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో రేషన్ చౌక దుకాణములు ప్రారంభిస్తు లబ్దిదారులకు రేషన్ పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చెప్పట్టిన రేషన్ విధానంలో అనేక సమస్యలు లబ్దిదారులు ఎదురుకోవాల్సి వచ్చిందని దానికి భిన్నంగా ప్రతి లబ్దిదారులకు ఎటువంటి సమస్యలు లేకుండ రేషన్ దుకాణం వద్ద నాణ్యమైన సరుకులు అందజేయడం జరుగుతుందని, అలాగే నేరుగా వృద్దులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే సరుకులు సప్లై చెయ్యడం జరుగుతుందని ప్రతి ఒక్కరు దుకాణం వద్ద ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు సాయంత్రం 4గంటల నుండి రాత్రి 8గంటల వరకు 1వ తారీకు నుండి 15వ తేదీ వరకు అందుబాటులో ఉండటం జరుగుతుందని ప్రతిఒక్క సభ్యులు సేవలు వినియోగించుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌టీసీ ఆధ్వర్యంలో విమాన, రైళ్లు ప్యాకేజీ

- వివరాలు వెల్లడించిన టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘు మిత్ర రౌల్

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌టీసీ) ఆధ్వర్యంలో తీర్థయాత్రలకు విమాన ప్యాకేజీ, రైళ్లు నడుపుతున్నట్లు ఐఆర్‌టీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రావుల్ తెలిపారు. ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వేస్టేషన్‌లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టూరిజం ప్యాకేజీల వివరాలు వెల్ల డించారు. జూన్ 28వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు శాంకరీదేవీ శక్తి పీఠంతో శ్రీలంక రామాయణ యాత్ర పలు దేవాలయాలు దర్శించవచ్చునని తెలి పారు. కేరళ విమాన ప్యాకేజీతో పలు దేవాలయాల దర్శనాలకు సెప్టెంబర్ 12 వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు 7 పగళ్ల ప్రయాణానికి, గుజరాత్ పుణ్యక్షేత్రాల, స్టాచు ఆఫ్ యూనిటీ ప్రయాణానికి ఆగస్టు 14వ తేదీ నుంచి 23వ తేదీ వరకు 9 రాత్రులు, 10 పగళ్ల ప్రయాణానికి తగిన విమాన ప్యాకేజీలను నిర్ణయిం చినట్లు తెలిపారు. ఈ ప్రయాణాల్లో విమాన చార్జీలు, హెూటల్, వసతి, భోజనాలు వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు గంగా రా మాయణ పుణ్య క్షేత్ర రైళ్ల యాత్ర వారణాసి, అయో ధ్యకు ప్యాకేజీ ఉందని ఈ రైలు శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. జూన్ 14వ తేదీ నుంచి జూన్ 26వ తేదీ వరకు అన్ని వసతులతో కలిపి స్లీపర్ రూ. 16200, 3 ఏసీ 26 500, 2 ఏసీ 35000 రూపాయలు గా ధరలు నిర్ణయించినట్లు తెలియజేశారు. ఈ రైలు ప్యాకేజీ యాత్రకు అన్ని సదుపాయాలను ఐఆర్‌టీసీ కల్పి స్తుందన్నారు. వివరాలకు 9281030748, 9281495847, 9550166168 నెంబర్లను సంప్రదించాలన్నారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్ గేట్ నెంబర్1లో ఉన్న ఐఆర్‌టీసీలో ప్యాకేజీ వివరాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో అన్ని భోజన అల్పాహార వస్తువులతో పాటు టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శనా స్థలాలను చూపబడునని వివ రించారు. ప్రయాణ భీమా ఇన్సూరెన్సులు ఐ ఆర్ సి టి సి ఆధ్వర్యంలో ఉంటాయని తెలిపారు. ఈ ప్యాకే జీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఛీఫ్ కమర్షియల్ జి.దినేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలి

- యోగాసనాలతో శారీరక రుగ్మతలు దూరం

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయాలి, యోగాసనాలతో శారీరక రుగ్మతలు దూరం అవుతాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జూన్ 3వ తేది శ్రీకాకుళం మండలం పెద్ద గణగళ్లవానిపేటలో తీర ప్రాంతంలో మత్స్యకారులతో యోగా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ జ్యోతి ప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన ప్రకారం యోగా మాసంలో భాగంగా ఈ రోజు శ్రీకాకుళం మండలం పెద్దగణగళ్లవానిపేటలో ఉదయం 7.00 గంటల నుంచి 8:30 వరకు యోగాసనాలను చేయడం జరిగిందన్నారు. మత్స్యకారులు ప్రతీ రోజు సముద్రంలోకి వేటకు వెళతారని, వారికి ఈ యోగా మరింత ఉపయోగ పడుతుందన్నారు. మనసు ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండాలంటే యోగాసనాలు వేయాలన్నారు. ప్రతీ రోజు యోగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంటి వద్ద లేదా పార్క్ వద్ద ప్రతీ రోజు యోగాసనాలు వేసుకోవచ్చన్నారు. 5 వేల మంది పైనే మత్స్యకారులు పాల్గొన్నట్లు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో ప్రధాన 5లక్షల మందితో నిర్వహించనున్నట్లు వివరించారు. మే 21వ తేదీన అరసవల్లి నుండి యోగాంధ్ర ప్రారంభించడమైనదని, ఇటీవల చారిత్రక ప్రదేశమైన డచ్ భవనం వద్ద వెయ్యి మంది తో యోగాసనాలు చేయించినట్లు వివరించారు. తీర ప్రాంతలో ఐదు వేల మంది పైన మత్స్యకారులు పాల్గొన్నట్లు చెప్పారు. 80 అడుగుల రహదారిలో ప్రతీ రోజు యోగా చేస్తున్నట్టు చెప్పారు. అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. యోగా పోటీలు నిర్వహిస్తామన్నారు. మత్స్యకారులు అధికారులు, ప్రజలు, విద్యార్థినీ విద్యార్థులు, అందరితో కలిసి చల్లని గాలితో, చక్కటి వాతావరణంలో యోగా చేయడం చాలా ఆహ్లాదకరంగా, సంతోషంగా ఉందన్నారు. అందరూ యోగాని మన జీవితంలో భాగం చేసుకుంటూ ఆరోగ్యమైన జీవితాన్ని తీర్చిదిద్దుకుంటామని ప్రతిజ్ఞ చేయడం జరిగిందన్నారు. శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ మనస్సు, శ్వాస, వ్యాయామమే యోగా అన్నారు. అటువంటి యోగాని ప్రతిరోజు ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయాలని, దాని ద్వారా ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా అనేక రుగ్మతలను దూరం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. తద్వారా ఆసుపత్రులలో రోగుల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. ప్రధాన వేదిక వద్ద మురళీకృష్ణ అందరిచేత యోగాసనాలు వేయించి ఇన్ స్ట్రక్టర్ గా వ్యవహరించారు. మధ్య మధ్యలో యోగా ఇన్ స్ట్రక్టర్లను ఏర్పాటు చేశారు. ఆర్ కల్పనా సూక్ష్మ వ్యాయాయంతో ప్రారభించి యోహాగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, డ్వామా పీడీ సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. అనిత, స్త్రీ, మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ, విభిన్న ప్రతిభా వంతులు శాఖ ఎడి కె. కవిత, ఆయుష్ డాక్టర్ జగదీష్, పెద్దగణగళ్లవానిపేట ఎంపిటిసి అమ్మాజిరావు, సర్పంచ్ బర్రి రామారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ, ఇతర జిల్లా అధికారులు, మత్స్యకారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీలమణి అమ్మవారి గుడి దగ్గర రోడ్డు డిజైన్ మార్పు చేయాలి

- నరసన్నపేట-ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో రామ్మోహన్ నాయుడు ప్రత్యేక భేటీ

విశాలాంధ్ర -శ్రీకాకుళం టౌన్: పాతపట్నం వద్ద నిర్మిస్తున్న ఆర్ఓబి కారణంగా నీలమణి అమ్మవారి గుడి ప్రాంగణం ఎర్త్ వాల్ వల్ల మూసుకుపోవటం భక్తులకు ఇబ్బందికరంగా మారుతుందని 110 మీటర్ల విడక్ట్ నిర్మాణం చేపట్టి ఆలయానికి నేరుగా వెళ్లే లాగా మార్గం అందించాలని కేంద్ర మంత్రి నితిన్ గాడ్కరి ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేకంగా కలిసి విన్నవించారు. దీనికి సుమారు 8 కోట్ల రూపాయల అదనపు ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారన్నారు. జిల్లా నుండి సాగే జాతీయ రహదారి - 16 నరసన్నపేట వరకే ఆరు వరసలుగా ఉందని, చెన్నై కలకత్తా జాతీయ రహదారిపై ఉన్న రద్దీ దృష్ట్యా నరసన్నపేట నుండి ఇచ్చాపురం వరకు ఆరువరుసలగా విస్తరించాలని కోరారు.

పచ్చదనమే లక్ష్యం

- జూన్ 5న ప్రతి మొక్కకు రక్షణే మిషన్

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5న పురస్కరించుకుని జిల్లాను పచ్చదనంతో నింపడమే లక్ష్యంగా, మొక్కలు నాటే కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల సంఖ్య, వాటి లభ్యతను ఖచ్చితంగా అంచనా వేయాలని, ట్రీ గార్డులు సిద్ధం చేయాలని, సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్ పూర్తి చేయాలని కలెక్టర్ కీలక సూచనలు చేశారు. అంతేకాకుండా, కాంపౌండ్ వాల్ లేని ప్రదేశాల్లో వరుసగా మొక్కలు నాటాలని, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, జూనియర్ రెడ్ క్రాస్, వెల్ఫేర్ అసోసియేషన్లను ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)కు సంబంధించి 'యోగాంధ్ర ప్రచారం 2025' కోసం ముందస్తు సన్నాహాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రధానమంత్రి మోదీ పాల్గొనే ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస ప్రాంతాల నుంచి 20 వేల మంది యోగా అభ్యాసకులను సిద్ధం చేయాలని నిర్దేశించారు. అదనంగా, పెన్షన్ పంపిణీలో లోటుపాట్లపై ప్రతి రోజు తనిఖీ చేయాలని, అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఎరువులు, విత్తనాల సరఫరాలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, మాదకద్రవ్యాలు, మహిళలపై నేరాల నివారణకు పోలీస్ విభాగం కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద వంశధార, ఇతర ప్రాజెక్టుల్లో మొక్కలు నాటడం, సీజనల్ వ్యాధుల నివారణకు వేగంగా నీటి నమూనాల పరీక్షలు చేపట్టడం, వర్షాకాలం దృష్ట్యా కాలువల శుభ్రతపై మున్సిపల్, డీపీవో సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపైనా కలెక్టర్ సమీక్షించారు. జీపీఏ, జీవీఏ పెంపు అంశాల్లో అన్ని శాఖల చురుకైన పాత్ర ఉండాలని స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్ అమలును కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సమీక్షలో జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, వ్యవసాయ అధికారి కోరాడ త్రినాధ స్వామి, పీడీ బి. శాంతి శ్రీ, హౌసింగ్ పీడీ నాగేశ్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు వైసీపీ వి..... పథకాలు టీడీపీ నాయకులవా....?

ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ

విశాలాంధ్ర-పలాస: మండలంలో వైసీపీ అధికారంలో ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో అభివృద్ధి పనులకు పంచాయితీ, మండల తీర్మానం చేస్తుంటే ప్రభుత్వ పథకాలు అధికార పార్టీ నాయకులకు కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ అధికారులను ప్రశ్నించారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు వస్తున్న సమయంలో స్థానిక పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసిల సిఫార్సు చేసిన వారికి ఇవ్వకుండా అధికారపార్టీకి చెందిన వ్యక్తులకే కేటాయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇక నుంచి కొంత శాంతమైన తమకు సంబంధించిన వ్యక్తులకు కేటాహించక పోతే తీర్మానం ఇవ్వడం కుదరదన్నారు. ఎన్ ఆర్ ఈ జి ఎస్ పథకం కింద గోశాలలు నిజమైన లబ్ధిదారులకు ఇచ్చారా అంటూ ఏపిఓ శంకర్రావుకు ప్రశ్నించారు. అన్నదాతకు అండగా ఉంటామని చెబుతున్న కూటమి ప్రభుత్వం రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయలేదని వ్యవసాయ శాఖ ఎఓ పోలారావును నిలదీశారు. చివరకు రైతులు తమ ధాన్యాన్ని వ్యాపారులు, దళారులకు ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది అన్నదాత సుఖీభవ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వంశధార పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయడం సంతోషమే కానీ కాలువ ఉపయోగపడే పనులు చేపట్టడం ద్వారా శివారు భూములకు సాగునీరు అందే అవకాశం ఉందని ఆ దిశగా ప్రతిపాదనలు ఎందుకు చేయలేదని వంశధార ఎఇ మీనాక్షిను నిలదీశారు. బొడ్డపాడు సర్పంచ్ తామడ మధన్ మాట్లాడుతూ రేషన్ సరుకులు ఇవ్వాలని అడుగుతుంటే డీలర్ ఇక్కడ రేషన్ ఇవ్వడం కుదరదని చెబుతున్నారని, లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందేలా చూడాలని కోరారు. చినంచల ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో నిరంతరం అంతరాయం కలుగుతోందని, ఇష్టానుసారంగా బిల్లులు వస్తుండడంతో వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యుత్ శాఖ ఎఇ వివేకానందను నిలదీశారు. విద్యాశాఖకు సంబంధించిన పథకాల కోసం మండల విద్యాశాఖాధికారి సిహెచ్ శ్రీనివాసరావు వివరిస్తుండగా ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన స్పందిస్తూ గత ప్రభుత్వంలో ఉన్న పథకాల్ని పేర్లు మార్చి పెడుతున్నారే తప్ప అదనంగా ఏమైనా పెట్టరా లేదు కదా....? గత ఏడాది అమ్మకు వందనం ఇవ్వకుండా కాలయాపన చేశారని, ఈ ఏడాదైనా విద్యా సంవత్సరం ముందు అమ్మకు వందనం ఇస్తారా లేదా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో ఎంపిడిఒ వసంత కుమార్, మండల ప్రత్యేకాధికారి పోతనపల్లి చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠ రావు, వైస్ ఎంపీపీ సవర దాలమ్మ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం ర్యాలీ

విశాలాంధ్ర-పలాస: కాశీబుగ్గ వైస్సార్ కూడలి వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు జరగనున్న "వెన్నుపోటు దినం" ర్యాలీ కార్యక్రమంను విజయవంతం చేయాలని పట్టణ వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వైసీపీ అధ్యక్షులు శిస్టు గోపి ఆధ్వర్యంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస-కాశీబుగ్గ పట్టణ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం గత వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పైన మరియు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారి పైన ఎన్నో లేనిపోని అబద్ధాలను ప్రచారం చేసి, సంపద సృష్టించి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న పథకాలు కంటే ఎక్కువగానే ప్రజలను అన్నివిధాలా ఆదుకుంటామని తప్పుడు వాగ్దనాలు చేసారన్నారు. అమలు సాధ్యం కానీ హామీలతో సూపర్ 6 అంటూ ప్రజలను మబ్బిపెట్టి గద్దినెక్కిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏడాది కాలం అవుతున్న కూటమి నాయకులు వారి బాధ్యతను మరిచిపోయి ప్రజల తరపున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులు పైన దాడులు చేస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తూ రాష్ట్రంలో అరాచక పాలన చేస్తుందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి మొద్దునిద్ర నటిస్తున్న కూటమి ప్రభుత్వంకు తన బాధ్యతల గుర్తు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా "వెన్నుపోటు దినం" కార్యక్రమం కోసం పిలుపునిచ్చారు. కార్యక్రమం లో భాగంగా మాజీ మంత్రివర్యులు డా. సీదిరి.అప్పలరాజు ఆధ్వర్యంలో పలాస నియోజకవర్గం వైస్సార్సీపీ శ్రేణులు మరియు ప్రజలను మమేకం చేస్తూ పలాస-కాశీబుగ్గ పట్టణంలో "వెన్నుపోటు దినం" ర్యాలీ జరగనున్న సందర్భంగా కార్యక్రమం విజయవంతం చేయాలని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శిష్టు.గోపీ, పట్టణ వైస్ చైర్మన్ బోర.కృష్ణారావు(బుజ్జి), మునిసిపల్ విప్ కౌన్సిలర్ శంకర్ పండా, 20వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి అంబటి.ఆనందరావు 12వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి పోతనపల్లి.హరిప్రసాద్ 8వ వార్డు కౌన్సిలర్ పిచ్చుక.అజయ్, 3వ వార్డు కౌన్సిలర్ సవర.సోమేశ్వరరావు, మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యులు అధ్యక్షులు బమ్మిడి.సంతోష్, 10వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శర్వాణ రవికుమార్, 24వ వార్డు ఇంచార్జ్ నర్తు వెంకటరమణ, బమ్మిడి.సుధాకర్ పాల్గొన్నారు.

వెన్నుపోటు, గొడ్డలి వేటుకు పేటెంట్ రైట్స్ జగన్ రెడ్డిదే : ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం : వెన్నుపోటు, గొడ్డలి వేటు పేటెంట్ రైట్స్ జగన్మోహన్‌రెడ్డిదేనని పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలోమంగళవారం మీడియా సమావేశం నిర్వహించి ఏడాదిలోపే 70 శాతం హామీలను నెరవేర్చామని ఇందుకు రోజు రోజుకు ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరగనుండడంతో ఓర్వలేని జగన్ రెడ్డి విషం కక్కడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే గోవిందరావు ఎద్దేవా చేశారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఒక్క రహదారిని కూడా పూర్తిచేసిన పాపాన పోలేదని చివరకు పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్ లను కూడా మూసివేసిన ఘనుడు జగన్ రెడ్డి అని విమర్శించారు. కూటమి ప్రభుత్వాన్ని కానీ, నాయకులను కానీ విమర్శించే నైతిక హక్కు జగన్మోహన్ రెడ్డికి లేదని ఆస్తికోసం కన్నతల్లిని తోడపుట్టిన చెల్లిని కూడా వెన్నుపోటు పొడిచే ఘనుడు జగన్ రెడ్డి అని, ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చిన చరిత్ర జగన్ రెడ్డి వైసీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఏడాదిలోపే ఇచ్చిన హామీలలో పింఛన్లు పెంపు, మెగా డీఎస్సీలతో పాటు దశాబ్దాల పాటు రహదారులకు నోచుకోని గ్రామాలకు కూడా ఈ రోజు మోక్షం కలిగిందంటే అది కూటమి ప్రభుత్వమే కారణమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం,అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కొనియాడారు. సమావేశం లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీ చింతామణి సంబరం

విశాలాంధ్ర-కవిటి: ఉద్దానం ఆరాధ్య దైవం,భక్తుల పాలిట కొంగుబంగారం అయిన కవిటి గ్రామ దేవత శ్రీ చింతామణి అమ్మవారి సంబరంను ఉషోదయ యువజన సంఘం, కవిటి గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సాయింత్రం అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దలను మేళతాళాలు, కాళీకా నృత్యాలు, కోయిడాన్స్, సాముగరిడి, కోలాటం, ధూం ధమాకా, ఆవు- పులి వేషం, రాధా- కృష్ణ, అమ్మవారి రూపలు, కింగ్ కాంగ్, కోతి బొమ్మలు, పొడుగ మనుషులు వంటి వీధి నాటకాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించి అనంతరం గుడి వద్దకు చేరుకుని మొక్కుల తీర్చుకున్నారు. ఖరీఫ్‌కు ముందు అమ్మవారికి చల్లదనం చేయడం ఆనవాయితీ అని సంఘ సభ్యులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొని అమ్మవారికి పూజ నిర్వహించారు.

సారవకోట గ్రంథాలయంలో అష్టా చెమ్మా ఆటల పోటీలు

విశాలాంధ్ర- జలుమూరు: మండల కేంద్రం సారవకోట బావ్రాజీ స్మారక గ్రంథాలయంలో మంగళ వారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు ఆటలపై ఆసక్తి కలిగేందుకు అష్టా చెమ్మా ఆటలను ఘనంగా నిర్వహించారు. విద్యా విజ్ఞానంతో పాటు మానసిక ఉల్లాసాలకు పిల్లలకు అప్పుడప్పుడు క్రీడలు ఏర్పాటు చేయాలని క్రీడల ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని గ్రంథాలయ అధికారిని డి సాయన్న అన్నారు. శుభ డి సాయమ్మ అన్నారు ఆమెతో పాటు సహాయాదికారి రుష్య సింగ్ రామకృష్ణ, స్థానికులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురవుతున్న ఆనాటి సాగరాలు...

దీనిని రక్షించేవాడు లేడా? అనే విమర్శలు!

- పట్టించుకోని అధికారులు.. ఇరిగేషన్ వారికి లేదు, రెవెన్యూ వారికి అసలే లేదు. ఇదీ చెరువుల ఆక్రమణల పరిస్థితి



ఆక్రమణలకు గురవుతున్న చెరువులు, సాగరాలు

విశాలాంధ్ర-జలుమూరు: శతాబ్దాల క్రితం వేలాది రైతులకు వారి పంట పొలాలకు సాగునీరు అందించేందుకు నిర్మించిన సాగరాలు నేడు అక్రమ ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునే వాడు లేడనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. స్వాతంత్ర్యం రాక పూర్వం రైతులు బాగుకోసం మంచి ఆశయంతో వందలాది ఎకరాల విస్తీర్ణం గల చెరువులను రాజులు ఏర్పాటు చేశారు. రాజులు పోయారు రాజ్యాలు వచ్చే ఉన్న చెరువులను మింగేస్తున్నారు తప్ప కాపాడిన వాడే లేడని విమర్శిస్తున్నారు. సారవకోట పాతపట్నం మండల సరిహద్దులో ఉన్న అసర్ల సాగరం, తెంబూరు సాగరం అంటారు. సుమారు 825 ఎకరాల చెరువు గర్భం ఉందని ప్రస్తుతం సగభాగానికి ఎక్కువ ఆక్రమణ గురైందని విమర్శలు ఉన్నాయి. ఎటువంటి సాగునీటి సౌకర్యాలు లేని కాలములో టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గ పరిధిలో అనేక గ్రామాలకు వందలాది ఎకరాలకు సాగునీరు అందేదని అటువంటి చెరువులను ఇలా ఆక్రమణ గురవుతుంటే అధికారులు కనీసం చర్యలు చేపట్టకపోవడం విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ ప్రభుత్వం ఉంటే ఆక్రమిస్తున్నారని వీరు ఈ ప్రభుత్వం వస్తే చెరువులు మింగేస్తున్నారని మీరు ఇలా ఒకరికి ఒకరు అనుకోవడమే తప్ప రైతాంగానికి ఆస్తులను కాపాడవలసిన అధికారులు మాత్రం చూచి చూడనట్లు కాలం గడుపుతున్నారని విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇటువంటి ఖరీదు గల ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు పెద్దలు అంటున్నారు.

5న హరిపురంలో కవితల పోటీలు..

విశాలాంధ్ర-మందస: ప్రజావిజ్ఞాన వేదిక మందస ఆధ్వర్యంలో ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కవితల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రజా విజ్ఞాన వేదిక కన్వీనర్ మార్పు జగన్మోహన్ రావు ప్రకటనలో తెలిపారు. ఉత్సాహం గల అభ్యర్థులు "పర్యావరణ పరిరక్షణ"అనే అంశంపై కవితలు రాసి జూన్ 5 గురువారం ఉదయం 8:30 గంటలకు హరిపురం శ్రీ వెంకటేశ్వర విద్యానికేతన్ కు హాజరుకావాలని పేర్కొన్నారు. పాఠశాల, కళాశాల, పీజీ స్థాయి అభ్యర్థులు పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులకు విలువైన బహుమతులు ఉంటాయని , ఆసక్తిగల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నంబర్లు 9398645293, 8985019835 కు ఫోన్ చేసి జూన్ 4 సాయంత్రం 6 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోరారు.

మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

నౌపడ వైద్యాధికారి డాక్టర్ పరిమళ

విశాలాంధ్ర-నంతబొమ్మాళి: మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పరిమళ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా, మంగళవారం నౌపడ పిహెచ్సి ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దోమలు గుడ్లు పెట్టే స్థలాలను గుర్తించి, నివారణ చేసే మందులను పిచికారి చేయాలన్నారు. మలేరియా వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారు ఆయా సబ్ సెంటర్ పరిధిలో ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు సంప్రదించాలన్నారు. అలాగే ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ప్రజలకు చైతన్యవంతం చేయాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు పి హెచ్ సి ని సంప్రదిస్తే, తగిన వైద్యం అందజేయడం జరుగుతుందన్నారు. మలేరియా వ్యాధి సోకిన తరువాత నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హెచ్ ఓ, ఎం గోవిందరావు, జి కూర్మ నాయకులు, సూపర్వైజర్ సంపత్ రావు మోహన్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్ తప్పనిసరి : ఎస్సై

విశాలాంధ్ర-నంతబొమ్మాళి: ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్ తప్పనిసరి అని సంతబొమ్మాళి మండలం సబ్ ఇన్స్పెక్టర్, వై.సింహాచలం అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు క్యూఆర్ కోడ్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఆటోకు క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్ అంటించాలని అందులో ఉన్న బార్కోడ్ ద్వారా ఆటోల వివరాలు పూర్తిగా తెలుస్తాయన్నారు. మహిళలు ఆటోలో ప్రయాణం చేసే ముందు స్మార్ట్ మొబైల్ లో క్యూ ఆర్ బార్కోడ్ స్కాన్ చేసుకోవాలని అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత సంబంధిత ఆటోకి ధృవపత్రాలు లేకపోయినా బార్కోడ్ ద్వారా పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ఆటో డ్రైవర్లు ఆటోలు నడిపే సమయంలో రహదారి భద్రతలను పాటించాలని, ప్రమాదాలు జరగకుండా నడపాలని ఎస్సై సూచించారు. హెచ్ సి వెంకట్రావు ఉన్నారు.

ఉద్దాన ప్రాంతంలో ప్రజల అన్నదమ్ముల భావనకు ముగ్ధుడినయ్యా...

బిలాయి ఎంఎల్‌ఏ దేవేంద్రయాదవ్

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: ఉద్దానం ప్రాంతంలో ప్రజలు ఐక్యతా, సోదర బావంకు తాను ముగ్ధడనయ్యానని, చత్తీస్ ఘడ్ రాష్ట్రం బిలాయి ఎంఎస్ఏ, బిహార్ రాష్ట్ర ఇన్చార్జ్, ఏఐసిసి కార్యదర్శి దేవేంద్ర యాదవ్ అన్నారు. మంగళవారం వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులో జరుగుతున్న కొండ మహాంకాళీ గ్రామ దేవత ఉత్సవాలల్లో ఎంఎల్ఏ దేవేంద్ర యాదవ్ పాల్గొన్ని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసారు. గతంలో అక్కుపల్లిలో జరిగిన గ్రామ దేవత ఉత్సవాలల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ప్రజలలో ఐక్యత. పర్యవరణ పరిశుభ్రత, సోదర బావంతో కూడిన అనుబంధం తనకు ఎంతో ఇష్టమన్నారు. ప్రస్తుతం రాజకీయాలు మాట్లాడానికి తాను రాలేదన్నారు. కేవలం భక్తి బావం, ప్రజలతో ఉన్న మమేకత, అందరిని గౌరవించే విశాలదృక్పదం. స్నేహబావం ఎంతో ఇష్టమన్నారు. రెండు రోజులుగా స్థానికులు అందించే స్నేహపూర్వక వాతవరణ మరువులేనిదన్నారు. తెలుగుప్రజలంటే ఎంతో అభిమానమని అందువలనే ఆహ్వానించిన వెంటనే మోట్టూరు సంబరాలకు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మోట్టూరు గ్రామస్తులు ఎంఎల్ఏ దేవేంద్రయాదవ్ ను ఘనంగా సత్కరించారు. ఎంఎల్ వెంట లక్ష్మిపతి. మల్లా రవికుమార్, జి రాజు, నాగమణి, కామరాజు, చిరంజీవి ఉన్నారు.

ప్రజా దృష్టి మళ్లించడానికే ధర్నాల డ్రామా

ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర-కవిటి: కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే జగన్ ముఠా ధర్నాల డ్రామా ఆడుతున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే అశోక్ క్యాంప కార్యాలయం రామయ్యపుట్టగలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ వైసిపి హయాంలో తొలి ఏడాది కాలంలో 10శాతం హామీలను కూడా అమలు చేయని జగన్ ప్రభుత్వం దెయ్యాలు వేదాలు చెప్పిన చందంగా ఉందని అన్నారు. మద్యపాన నిషేధంపై మాట తప్పి, మడమతిప్పి విషపూరిత మద్యం పోసి పేదల ఆరోగ్యానికే వెన్నుపోటు పొడిచారని ఎద్దేవా చేశారు. మెగా డీఎస్సీ హామీ పై మాట తప్పి యువతకు వెన్నుపోటు, అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదలను, కార్మికులను వెన్నుపోటు పొడిచారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచారని అన్నారు. కూటమి పాలనలో తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వందని అన్నారు. అధికారంలోకి వచ్చి తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు చేసిన ప్రభుత్వం మరొకటి లేదని సంక్షేమం-అభివృద్ధి సమపాలనలో చేస్తున్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని అసలైన వెన్నుపోటు దారుడు జగన్ రెడ్డని వెన్నుపోటు అంటూ ధర్నాలు చేయడం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ ముఠా దుష్ప్రచారాలు త్రిప్పికొట్టి అభివృద్ధి- సంక్షేమాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

క్లబ్ ఫుట్ సమస్యను సరిచేయడం సాధ్యమే

- క్లబ్‌ఫుడ్ పై తల్లిదండ్రులకు అవగాహన.
- ప్రముఖ వైద్యులు ఆర్తోపెడిక్ నిపుణులు డాక్టర్ ఎస్. రాజశేఖర్

విశాలాంధ్ర-టెక్కలి: సరైన సమయానికి చికిత్స తీసుకుంటే క్లబ్ ఫుట్ సమస్యను పూర్తిగా సరిచేయడం సాధ్యమేనని ఆర్తోపెడిక్ నిపుణులు డాక్టర్ ఎస్. రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డీఈఐసి సెంటర్లో మంగళవారం వరల్డ్ క్లబ్ ఫుడ్ డేను పురస్కరించుకొని, చిన్నారుల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఫుడ్ అనేది పుట్టుకతోనే వంకర పాదాలు కలిగి ఉంటాయని, వాటి సమస్యలపై అవగాహన కల్పించారు. వంకర పాదాలు ఏర్పడే పరిస్థితులపై, దీని కారణాలు, చికిత్స విధానాలు మరియు నివారణ చర్యలు గురించి వివరించారు. క్లబ్ ఫుట్ వంశపారంగా కొంతమందిలో వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం క్లబ్ ఫుడ్ సమస్యకు ఆధునిక శాస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తద్వారా సమస్యను పరిష్కరిం చేందుకు అవకాశం ఉందని తెలిపారు. గతములో పిల్లల తల్లిదండ్రులలో అవగాహన లేకపోవడం, టెక్నిక్స్ అంతగా అందు బాటులో లేకపోవడంతో క్లబ్ ఫుడ్ సమస్యతో బాధపడుతున్న వారు సంఖ్య ఎక్కువగా ఉండేది అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతో పాటు టెక్నిక్స్ తో పిల్లలు సాధారణ జీవితం గడపడమే కాకుండా క్రీడలలో కూడా పాల్గొనవచ్చు అన్నారు. క్లబ్ ఫుట్ పై తల్లిదండ్రులు ప్రస్తుత సమయాలలో భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, సరైన సమయానికి చికిత్సలు అందించుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

భలే గమ్మత్తైన బదిలీలలు

- డీఎస్సీలో పిఎస్ హెచ్ఎం పోస్ట్ ఏ కేడర్ లో ఫిల్ చేస్తారు..?
- ఇది రిక్రూట్మెంట్ కేడర్ పోస్టేనా...

కౌన్సిలింగ్లో కూర్చున్నఉపాధ్యాయులు

విశాలాంధ్ర- ఆమదాల వలస: ఎస్‌జిటి నుండి ప్రమోషన్ ద్వారా ఫిల్ చేయాల్సిన ఇటువంటి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టు ను ఇప్పటికే సర్వస్ స్కూల్ అసిస్టెంట్లతో కొన్ని ఫిల్ చేస్తూ ఎస్టీటీల నడ్డి విరిచారు. ఇప్పటికే మరో 3200 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టులు డీఎ స్సీ ద్వారా ఎలా భర్తీ చేస్తారు అనేది ఉపాధ్యాయుల కు అందని ప్రశ్న. టెక్నికల్ గా ఆ అవకాశమే లేదు, ఒకవేళ చేస్తే కనుక ఎవరు అర్హులు..! స్కూల్ అసిస్టెంట్ క్యాడర్లో మెథడాలజీతో సంబంధం లేకుండా అన్ని సబ్జెక్టుల బిఈడి అర్హతలు కలిగిన వాళ్ళు ఈ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవచ్చా..? అలా అయితే మరోసారి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల హక్కులను కాల రాసినట్లు కాదా..? ప్రభుత్వానికి మంచి సలహా లు ఇవ్వడంలోనూ, ఉపాధ్యాయుల హక్కులు కాపా దడంలోనూ ఉపాధ్యాయ సంఘాలు ఘోరంగా వైఫ ల్యం చెందుతున్నాయి.

మాస్టారు ఇదేమి నాయకత్వం ?

షెడ్యూల్లో లేని అంశాలు ఏ పూటకా పూట కొత్త పుంతలు తొక్కుతున్నయి. షెడ్యూల్ అజెండా ఎడా పెడా మారుస్తున్న సంఘాలు పట్టించుకోవడం లేదు అనే విమర్శ ఉపాధ్యాయులు నెలకొంది. బదిలీ ల్లో చోటు చేసుకుంటున్నా మార్పులను ఒక సర్కులర్ రూపంలో గానీ మెమో రూపంలో గానీ ఇవ్వక పోయి నా ఉపాధ్యాయ బదిలీల ప్రధాన ఉత్తర్వులకు అను బంధ ఉత్తర్వులు లేకపోయినా జెడి సర్వీసెస్ రెగ్యు లర్ ప్రక్రియకు తిలోదకాలిచ్చినా పాఠశాల పునర్ని ర్మాణ ప్రక్రియ మొత్తం వెబెక్సు సమావేశాలతో వర్చు వల్ గా మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్న సంఘాలు నోరు మెదపడం లేదు ఇదేమి న్యాయకత్వం రా బా బు అంటూ ఉపాధ్యాయులు నెత్తి కొట్టుకుంటున్నారు. ఓ మహా యజ్ఞాన్ని ఎఫ్ ఎ క్యూల ద్వారా మాత్రమే జరిపించేస్తున్న అధికారులకు కిమ్మనకుండా కూర్చున్న సంఘ నాయకులకు ఉపాధ్యాయులు చేతులెత్తేసి మొక్కుతున్నారు. ఉపాధ్యాయ సంఘాలలో పోరాట పటిమ తగ్గిందా లేదా అధికారానికి తలగ్గిందా అనేది తేలాల్సిన ప్రశ్నగా మారింది.

పంట సాగు హక్కుపత్రం రైతు సేవా కేంద్రాల్లో పొందవచ్చు

విశాలాంధ్ర-సోంపేట: పంట సాగు హక్కుపత్రం కోసం కౌలుదారు రైతులు రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను గ్రామ రెవెన్యూ అధికారులును కలిసి పొందవచ్చునని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కే.జగన్‌మోహన్‌రావు సూచించారు. పంట సాగుహక్కు పత్రాల మీద అవగాహన కార్యక్రమాలను మంగళవారం మాల గోవిందపురం, సుంకిడి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి బి.నరసింహమూర్తితో కలిసి నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పంట సాగు హక్కు చట్టం 2019 ప్రకారం సాగుదారు హక్కు పత్రంతో పంట రుణాలు, పంటల భీమా, పెట్టుబడి రాయితీ, పంట నష్ట పరిహారం, కనీస మద్దతు ధర మరియు ఇతర సదుపాయాలు కౌలు రైతులు పొందవచ్చునని తెలిపారు. భూమిపై ఎటువంటి హక్కు గానీ ఇతర హక్కులు గాని పొంద లేరని బ్యాంకు నుంచి సాగుదారు పొందిన పంట రుణము తిరిగి చెల్లింపు బాధ్యత సాగుదారుదేనిని యజమానికి వర్తించదని కావున యజమానులు కౌలుదారులకు తమ భూమి వివరాలు అందజేసి కౌలు రైతుకు ప్రోత్సహించవలెనని కోరారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు జగన్, తిరుపతి వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, రైతులు ఉత్తరాల బ్రహ్మానందం, ఉత్తర కృష్ణారావు, భాస్కరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వెన్నుపోటు ను వివరిద్దాం

- ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో భారీ ర్యాలీ...
- దాసన్నపేట నుంచి వైయస్సార్ విగ్రహం వరకు నిరసన
- శాసనమండలి సభ్యులు నర్తు రామారావు



విశాలాంధ్ర-కవిటి: వెన్నుపోటు.. మోసం.. దగా.. మాయ వంటి నాలుగు స్తంభాలపై నిర్మించిన చంద్రబాబు నాయుడు రాజకీయాన్ని రాష్ట్ర ప్రజలకు తెలిపేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 4వ తేదీన ఒక వినూత్న కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఎన్నో అబద్ధాలు.. మరెన్నో మాయ మాటలు.. అమలు పరచలేని హామీలు.. ఇలా రాష్ట్ర ప్రజలకు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఘోరంగా విఫలమైంది. ఈ తరుణంలో చంద్రబాబు వెన్నుపోటు పాలనను ప్రజలకు వివరించేందుకు రేపటి రోజున వెన్నుపోటు దినోత్సవంగా రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాలలో నిరసన ర్యాలీలను నిర్వహించి, స్థానిక తహసీల్దార్లకు వినతి పత్రాలను అందుకోవాలని పార్టీ అధ్యక్షుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గం లో ఈ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించేందుకు శ్రీకాకుళం నియోజకవర్గంలో స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. గత నెల 31వ తేదీన కంచిలి పట్టణంలోని తన కార్యాలయంలో, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయసాయిరాజ్ తో కలిపి నియోజకవర్గస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మండలాలలో ఈ వెన్నుపోటు దినోత్సవం నిర్వహణకు సంబంధించి సమావేశాలు ఏర్పాటు చేయడమే కాకుండా, గోడపత్రికలను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీ బాయ్స్ హై స్కూల్ ఎదురుగా ఉన్న టెండ్స్ షోరూం పైన ఉన్న ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వ పాలనను ఎండగట్టారు. సూపర్ సిక్స్ అమలు చేస్తాము అనే ఒక అబద్ధపు హామీని ప్రజలకిచ్చి.. వారి మద్దతును కూడగట్టారని, అధికారంలోకి వచ్చాక ఆ హామీతో పాటు ప్రజల బాగోగులు మరిచిపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, సరైన సమయంలో ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే నాయకుడు జగన్మోహన్ రెడ్డి అంటూ ఆయన అందించిన సంక్షేమ పథకాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో నవరత్నాల సంక్షేమ పాలన ఒక చరిత్ర అని, ఈ ప్రభుత్వంలో సూపర్ సిక్స్ మోసమని నాయకులు విశ్లేషించారు. గత సంవత్సరం జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాల ద్వారా నూతన ప్రభుత్వం ఏర్పడిందని, ఏర్పడిన ఆ ప్రభుత్వం ప్రజా వంచన ప్రభుత్వమని రాష్ట్ర ప్రజలకు తెలియజేసేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఎమ్మెల్సీ తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు దాసన్నపేట జంక్షన్ నుంచి వైయస్సార్ విగ్రహం వరకు సుమారు 5000 మందితో బైక్ ర్యాలీని నిర్వహించి తమ నిరసనను తెలియజేస్తామని స్పష్టం చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయానికి చేరుకుని ప్రభుత్వ పాలనపై నిరసన వినతి పత్రాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రారంభంలో తన ఇంటి వద్ద నుంచి దాదాపు 500 బైక్లతో ఇచ్ఛాపురం చేరుకుంటానని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. ఉదయం 9 గంటలకు దాసన్నపేట జంక్షన్ వద్దకు ఇచ్ఛాపురం నియోజకవర్గం, మున్సిపాలిటీ లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు, అభిమానులు, అంతా హాజరవ్వాలని కోరారు.